

# దాత

మాన్యుల సంగతి చెప్పలేను కానీ, నాలాంటి సామాన్యులకు సుఖాన్నిచ్చేవి రెండు.

ఒకటి తిండి, రెండోది నిద్ర. మొదటిదాని విషయంలో కొంత పూర్వపక్షం చేసేవాళ్ళు ఉండవచ్చుగానీ రెండోదాన్ని కాదనేవాళ్లు ఉండరనే నా నమ్మకం.

తెల్లవారు ఝాము బ్రాహ్మీ ముహూర్తమని, ఆ సమయంలో చేపట్టే పనులు అద్భుతమైన ఫలితాలనిస్తాయనీ చెబుతుంటారు. జ్యోతిష్యాన్నీ, సెంటిమెంట్లనూ అంతగా పట్టించుకోని నాక్కూడా ఈ విషయం సహేతుకంగానే అనిపిస్తున్నా సుఖాన్ని వదులుకోవడం మాత్రం ఇష్టం లేదు. ఉదయం నాలుగు నుండి ఎనిమిది దాకా నిద్రపోవడంలోని బ్రహ్మానందం అనుభవించేవాళ్ళకి మాత్రమే తెలుస్తుందిగాని, సూక్తులు వల్లించే వాళ్ళకెలా తెలుస్తుంది? కానీ... నా బ్రహ్మానందానికి చిల్లుపడే దురదృష్టం సత్యం రూపంలో సాక్షాత్కారమైంది.

సత్యం చిత్రమైన మనిషి, తాను సంతోషంగా ఉంటూ ఎదుటివాళ్ళని సంతోషంగా ఉంచే ప్రయత్నం చేస్తుంటాడు. నవ్వుతూ మాట్లాడటం, హితం మాట్లాడటం, హితం చేయడం, మనఃపూర్వకంగా చేయడం, అందరికీ సాధ్యమయ్యే పనికాదు మరి. అందుకే అతను ఎందరికో హితుడు, కొందరికి స్నేహితుడు, మరికొద్దిమందికి సన్నిహితుడు ఆ కొద్దిమందిలో నేనున్నాననుకోవడం అదృష్టమే కాదు, గర్వంగానూ అనిపిస్తూంటుంది.

అతను పనిచేసేది ప్రభుత్వ కార్యాలయంలో. అందులోనూ పై రాబడి ఇబ్బడిముబ్బడిగా ఉండే విభాగమది. అయినా ఎవరి వద్దా డబ్బు తీసుకోకపోవడం ఒక విశేషమైతే, ప్రభుత్వ పథకాలూ నిధులూ చాలావరకు సద్వినియోగం అయ్యేలా కృషి చేయడం మరో ప్రత్యేకత. పైగా అతడు మధురాంతకం రాజారాం మాటల్లో చెప్పాలంటే 'ప్రొద్దుచాలని మనిషి'. రోజుకి పద్దెనిమిది గంటలు పనిచేసినా, మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో పెద్ద డాక్టర్‌లా చిర్నవ్వులు చిందిస్తూనే ఉంటాడు. దేవుడితడ్ని చేసేటప్పుడేదో కొత్త పదార్థం తప్పక ఉపయోగించి ఉంటాడు. అతను అందరివాడు, అందరికీ అందుబాటులో ఉండేవాడు. వసుధైక కుటుంబానికి ప్రతినిధి. అలాంటివాడు నా సుఖానికి... అదే, నిద్రా సుఖానికి కంటకంగా మారినా నేను వ్యతిరేకించగలనా?

అతని మంచితనాన్ని భరించలేక కొందరు ప్రయత్నపూర్వకంగా మా ఆఫీసుకు ట్రాన్స్‌ఫర్ చేయించారు. పూవెక్కడున్నా పరిమళం మారదు. దారి మళ్ళించినంత మాత్రాన ప్రవాహం ఆగదు కదా.

బూజు దులపని ఫైళ్ళలో తలలు దూర్చి, ముక్కుతూ మూల్గుతూ, చీదుతూ రోజులో ఆరు గంటలు ఆపసోపాలు పడే సిబ్బంది, ఐదు తర్వాత స్మశాన నిశ్శబ్దానికి నెలవయ్యే ఆఫీసు... సత్యం కాలుపెట్టి నెల తిరక్కుండానే ఉదయం ఆరు నుండి, రాత్రి పది దాకా కళకళలాడిపోతోంది. ఆఫీసు ప్రాంగణాన్ని శుభ్రం చేయించి బ్యాడ్మింటన్ కోర్టు వేయించాడు. ఆఫీసునానుకునే మైదానం ఉంది. తెల్లవారి ఐదున్నరకే వచ్చి పక్కన గ్రౌండ్‌లో రౌండ్స్ కొట్టడం, ఆపై ఓపికున్నంత సేపూ బ్యాడ్మింటన్ ఆడటం అలవాటు చేశాడు.

నెమ్మది నెమ్మదిగా మా ఆఫీసులోని అటెండర్ రాజు మొదలు అకౌంటెంటు పద్మనాభందాకా అందరినీ ఈ చైతన్యంలో భాగస్వాముల్ని చేశాడు. ఆ సెగ నాకూ తగిలినా, ఉదయం నిద్రను వదులుకోలేని నేను చిరునవ్వు దుప్పటి మాటున ఆత్మరక్షణ చేసుకుంటూ వస్తున్నాను. అనుకోకుండా ఒకనాటి సాయంత్రం ఉండబట్టలేక షటిల్ కోర్టులోకి దిగాను. యూనివర్సిటీలో నేను బ్యాడ్మింటన్ ఛాంపియన్నని తెలియని మా కొలీగ్స్ నా ఆటకు చిత్తయిపోయారు. ఎంతో నైపుణ్యం చూపే సత్యం

కూడా నాతో ఒక్క సెట్టయినా గెలవలేకపోయాడు. నా ప్రతిభే నా ఆనందానికి ప్రతిబంధకమౌతుందని ఆ క్షణం నేను గ్రహించకపోవడం యాదృచ్ఛికం. సత్యం పట్ల మొదటి నుండీ సదభిప్రాయమున్న నేను, అతని ప్రతిపాదన కాదనే సాహసం చేయలేకపోయాను. అలా... ఉదయం ఆరుగంటలకే నిద్రలేవడం తప్పనిసరైంది. అయినా లేచేటప్పుడు ఉండే చికాకూ, బాధా దినకరమయూఖ స్పర్శతో వదిలే చలి లాగే క్రమేపీ తగ్గిపోవడమూ పరిపాటిగా మారుతోంది.

సప్తవ్యసనాల్లో ఆటలేకపోవచ్చు, లేదా శాస్త్రకారులు ఆనాడు వ్యసనాలను పేర్కొన్ననాడు జూదమొక్కటే అప్పటి ఆటగావచ్చు. మొత్తంమీద ఆటకూడా వేట లాగే ఓ వ్యసనం అనిపిస్తుంది నాకు. కాకపోతే నా నిద్రను సైతం దూరం చేయగలిగే శక్తి దానికెక్కడిది? దానికి తోడు మా సత్యం వి'క్ర'మార్క'ప్రయత్నం... నిత్యం ఇలా చలిలో నడిచే పరిస్థితులు తెచ్చింది.

"నమస్తే అన్నా!"

ఇదే సత్యంతో చికాకు. ఎవ్వడెదురైతే వానితో మాట్లాడతాడు - విసుగూ - విరామం లేకుండా నవ్వుతూ. ఎవడో దానయ్య పలకరించాడు - బాతాఖానీ మొదలైంది. సమయాన్ని ఇష్టమైన పనికి వాడుకుంటే ఆదా. అదే ఇష్టంలేని దానికైతే వృథాయే కదా! నా టైమంతా వేస్ట్ అవుతున్న బాధ.

అదృష్టవంతుడ్నే ఆ శాల్తీ తొందరగానే వదిలాడు.

"అతను తెలుసా?" పదిరవై అడుగులు ముందుకొచ్చిన నన్ను చేరుకుంటూ అడిగాడు. సాధారణంగా అతను ఎవరితోనైనా మాట్లాడుతుంటే నేనిలా ముందుకొచ్చేస్తాను. అక్కడే ఉంటే మరింత ఆలస్యం చేస్తాడని.

సత్యం ప్రశ్నకు నేను జవాబివ్వలేదు. 'అది అనవసరమైన విషయం' అనే దృష్టితో.

"పెంటయ్య" నా మౌనాన్ని పట్టించుకోకుండా చెప్పాడు.

'బలే సూటయ్యిందే' అనుకున్నా మనసులోనే. మన చుట్టూ సమాజంలో నప్పని పేర్లెన్నో చూస్తుంటాం - మా పక్కింట్లో మౌనేశ్వరాచారి అనే ఒహతనుం టాడు. ఉదయం పేరుకు తగ్గట్టే కనిపిస్తాడు. కాని పొద్దుగుంకిందంటే తాగడం - ఆగ కుండా వాగడం... అర్ధరాత్రి దాకా; మా బంధువులబ్బాయొకడున్నాడు 'పవన్ కుమార్' బలంగా గాలి వీస్తే ఖచ్చితంగా పడిపోయేలా వుంటాడు. అంతెందుకు నా పక్కసీటు 'వామనరావు'... గట్టయ్యకు తమ్ముడల్లే ఉంటాడు... కాని ఈ పెంటయ్యకు పేరెట్టిన వాళ్ళకు మొక్కాల్సిందే.

బానపొట్ట, నల్లరాతి విగ్రహం, పెరిగిన గడ్డం, తైలసంస్కారంలేని జుట్టు, దిష్టిబొమ్మకు తగిలించినట్టు నిండు చేతుల బిగుతు చొక్కా కింద మోకాళ్ళు దాటని లాగు, ఆ చిరుగుల డ్రెస్సుకి పైనుండి టక్కు. ఒక్కసారి చూస్తే కలలో కూడా మరచి పోలేని సుందరాంగుడు. నుదుట ఆ చందనపు బొట్టే గనుక లేకుంటే ఏ పిచ్చాసుపత్రి నుంచో పారిపోయి వచ్చినట్లుంటాడు... నా ఆలోచనలకు సమాంత రంగా సత్యం అతని గురించి ఏదో చెబుతున్నాడు.

"... అతనో దాత."

ఉలిక్కిపడి సత్యంవైపు చూశాను - నమ్మలేనట్టు.

"ఎస్. హి ఈజ్ ఎ డోనర్!" ఇంగ్లీషులో చెబితేనే బాగా అర్థమౌతుందని గాబోలు... పునరుక్తంగా - సత్యం.

అచ్చం అడుక్కుతినే బికారి వెధవలా ఉండే ఈ పెంటయ్య 'దాత' అనే విష యం మనసుకి కొరుకుడు పడటం లేదు. అదే అడిగాను కవర్‌లో నుండి రాకెట్ బయటకు తీస్తూ.

"ఓ గేమ్‌కానీ, అన్నీ వివరంగా చెబుతా!" నంటూ షటిల్‌కాక్‌తో సిద్ధమ య్యాడు సత్యం.

తొలిగేమ్ తొలిసారిగా నేనోడిపోయను. అయినా నాకు బాధ అనిపించలేదు. పెంటయ్య గురించి తెలుసుకోవాలన్న ఉత్సుకత నన్ను తర్వాత గేమ్‌వైపు ఆకర్షించలేదు. అప్పుడే టీ బడ్డీ యాదగిరి ఫ్లాస్కులో టీ తీసుకొచ్చాడు. ఔన్సు లాంటి ప్లాస్టిక్ గ్లాసులోని టీని నెమ్మదిగా గొంతులోకి పంపుతూ అడిగాను - "పెంటయ్య గురించి చెప్పు!"

"అతను రంగస్వామికి దాయాది."

మరో బాంబుపేల్చాడు సత్యం.

రంగస్వామి ఈ పట్టణంలోనే పేరున్న వ్యాపారవేత్త. కోటీశ్వరుడు. అతనికీ... ఇతనికీ...

"పెంటయ్య లాగే పెంటయ్య తండ్రి చంద్రయ్య కూడా చాలా అమాయకుడు. దాన్ని ఆసరాగా చేసుకొని రంగస్వామి తండ్రి చంద్రయ్య ఆస్తిని కూడా తన ఆస్తిలో కలుపుకొని, వ్యాపారం చేసి కోట్లు గడించాడు. పెంటయ్య చిన్నతనంలోనే తల్లిదండ్రులు శ్రీశైలం నుండి తిరిగి వస్తూ, ఓ రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. అప్పటి నుండి పెంటయ్య వాళ్ళ పంచనే పడి వుంటున్నాడు. యాభైయేళ్ళొచ్చినా

అదే జీవనశైలి. తన కంటే రెండేళ్ళు మాత్రమే పెద్దవాడైన రంగస్వామి పెళ్ళి చేసుకొని బిడ్డల్ని కని, వాళ్ళ పెళ్ళిళ్లు చేసి తాత కూడా అయ్యాడు.

"పెంటయ్య రోజూ తెల్లవారు ఝామునే లేచి, స్నానం చేసి, ఆంజనేయస్వామి గుడికెళ్ళి వస్తాడు. ఆ తర్వాత ఊరంతా తిరుగుతాడు. ఎవ్వరెక్కడ కష్టపడుతుంటే అక్కడ సాయం చేస్తాడు. రిక్షావాడు లాగడంలో కష్టపడుతుంటే వెనక నుండి తో స్తాడు. చిన్నపిల్లలు బడికి వెళ్ళడానికి మారాం చేసూంటే ఎత్తుకొని అక్కడి దాకా వెళ్తాడు. చేతి పంపు వద్ద ఆడవాళ్ళకు నీళ్ళు తోడటంలో సాయం చేస్తాడు. రోడ్డు ప్రక్కన వృద్ధులెవరైనా చలికి వణుకుతూంటే చితుకలేరి, చెత్తాచెదారం పోగుచేసి మంటవేస్తాడు... ఇలాంటివెన్నో - అడగకుండానే సాయం చేస్తాడు. ఎవరైనా ఏదైనా పెడితే కాదనకుండా తింటాడు. ఎక్కడా ఏమీ దొరక్కపోతే మళ్ళీ ఆంజనేయస్వామి గుడికెళ్ళి కూర్చుంటాడు. పూజారి ప్రసాదం పెడితే సరి. లేకపోతే రామభజనతో కడుపునింపుకొని, రాత్రికి రంగస్వామి ఇంటికి చేరతాడు. వాళ్ళేదైనా పెడ్తే తిని వసారాలో ముడుచుకొని పడుకుంటాడు.

"ఇది బాగానే ఉంది. కాని ఈ అవతారానికి దానం చేసే సీనెక్కడుంది?" సత్యాన్ని అడ్డుకున్నాను.

"అదే చెబుతున్నా ఓ రోజు పెంటయ్య హఠాత్తుగా రంగస్వామిని - తనకుండటానికి వేరే స్థలం కావాలని అడిగడట. రంగస్వామి కూడా ఎదురు ప్రశ్నించకుండా 'ఎంతకావా?'లని అన్నాడు. ఇతను సింపుల్‌గా అయిదొందల గజాలు అడిగాడు. 'నిత్యం వీణ్ణి భరించే బాధ తప్పుతుందనుకున్నాడో, లేక వాళ్ళ ఆస్తి తింటున్నామనే అంతర్మథనం నుంచి బయటపడేందుకో - మరెందుకోగాని, 'ఇప్పిస్తా! ఎక్కడ కావాలి?' అనేశాడు రంగస్వామి.

"అన్నమాట ప్రకారం పెంటయ్య కోరికననుసరించి ఆంజనేయస్వామి గుడి పక్కనే అయిదువందల గజాల నేల వారంరోజుల్లో రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చాడు."

"అది సరే. నీ కథంతా తిరకాసులా వుంది. దాత అంటే దానం చేసేవాడేగాని, తీసుకునేవాడు కాదు. పెంటయ్య స్వీకర్తేగాని దాతకాడు." అసంతృప్తిగా మొహం పెట్టాను నేను.

"మరదే తొందరపాటంటే. నేను చెబుతూనే ఉన్నాను గదా. అయినా రంగ స్వామి పెంటయ్యకిచ్చింది దానం కాదు. అతని ఆస్తిలోనిదే కొంత భాగం. సరే! అతను దాత ఎలా అయ్యాడనే సంగతి తర్వాత చెబుతా! ముందు గేం పూర్తి చేద్దాం..." సత్యం ప్రతిపాదన.

"ఈ రోజుకు ఆటాడే ఆసక్తిలేదు. పెంటయ్య సంగతి పూర్తిగా చెప్పు." రాకెట్‌ని కవర్‌లో పెట్టేశాను.

"పెంటయ్య ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్న మరుసటి రోజే ఆంజనేయస్వామి ఆలయ కమిటీవాళ్ళకు గుడి పేరున దానం ఇచ్చేశాడు."

"మరిప్పుడు ఎక్కడుంటున్నాడు?" ఆశ్చర్యాన్నణచుకోలేకపోయాను.

"గుళ్ళోనే. అతనిచ్చిన స్థలంలో బ్రహ్మాండమైన కళ్యాణమండపం కట్టారు. దాతగా తన పేర ఆ మండపం మీద శిలాఫలకం పెట్టడానికీ పెంటయ్య ఒప్పుకోలేదు..."

ఉన్నట్టుండి వామనుడు త్రివిక్రముడైనట్లు ఇంతకు ముందు నేనసహ్యించుకున్న పెంటయ్య ఆరాధనీయుడూ, మహోన్నతుడూ అయ్యాడు.

"ఒక్కసారి అతడ్ని చూడాలని వుంది..." అన్నాను తిరిగి ఇంటికి వెళుతుండగా.

"తప్పకుండా!" భరోసా ఇచ్చాడు సత్యం.

ఇది జరిగిన వారం రోజులకు కాళ్ళకింద భూమి కంపించిపోయేటంతటి దుర్వార్త చెప్పాడు సత్యం.

"పెంటయ్య పోయాడట".

అది జీర్ణించుకోవడానికి చాలా సమయం పట్టింది నాకు.

"ఎప్పుడు?"

"ఈ తెల్లవారు జామునే."

"చూపొద్దాం పద!"

పదిహేన్నిముషాల్లో బయలుదేరాం.

జీవితం చాలా విచిత్రమైంది అనడానికి ఇది ఓ తాజా ఉదాహరణ. స్వార్థం చీకట్లో దారీ తెన్నూ లేకుండా పరుగులు పెట్టే మనం, అప్పుడప్పుడూ మిణుగురు పురుగులలాంటి ఒకటీ అరా మంచి నిర్ణయాలు తీసుకుంటాం. కాని, వాటిపట్ల సరియైన శ్రద్ధా, ఆసక్తీ లేకపోవడం వల్ల కళ్ళముందే కనుమరుగైపోతుంటే జడపదార్థాల్లా చూస్తూ ఊరుకుంటాం. వారంరోజుల క్రితం అతడ్ని చూడాలి, మాట్లాడాలి... అనుకున్న నా ఆలోచన కార్యరూపం దాల్చకుండానే ఇలా ఆవిరైపోవడం బాధగా

ఉంది. అతనితో ఏ సంబంధమూ లేకున్నా, కనీసం పరిచయం లేకున్నా నా కళ్ళలో నీళ్ళుబుకుతున్నాయి. మంచితనానికి విలువ తగ్గలేదనడానికి ఇది నిదర్శనమేమో!

ఏదో ఊహించుకుంటూ ఆంజనేయస్వామి గుడికి చేరుకున్న మేము అయోమయానికి లోనయ్యాం.

అక్కడ అలాంటి ఆనవాళ్ళేవీ కనిపించలేదు. జనం గుమిగూడి ఉండటం, విచార వదనాలు, రోదనలు... ఏవీ లేవు.

అయినా అతనికెవరున్నారని? ఏమో - సత్యం విన్నది సత్యం కాదేమోనన్న ఆశ కూడా క్షణంపాటు మెరిసింది.

"పెంటయ్య..." పూజారిని పిలిచి అడిగాడు సత్యం.

"ఉదయమే తీసుకుపోయారు." చెప్పలేక చెప్పాడు పూజారి.

"ఎక్కడికి?" ఠక్కున అడిగాను.

"హైదరాబాద్‌కి."

"ఎందుకు?" సత్యం, నేనూ ఒకేసారి అన్నాం. ఒక్క ప్రశ్నలో లక్ష సందేహాలు.

"ఆయన మహానుభావుడు సార్!" పూజారి కళ్ళలో నీళ్ళు.

మాటలు పెగల్చుకోవడానికి సమయం పట్టింది. "ధర్మాన్ని నిలబెట్టేందుకు భూదానం చేశాడు... కొందరి జీవితాల్ని నిలబెట్టేందుకోసం తన కళ్ళను... శరీర భాగాల్నీ దానం చేశాడు... పూర్తిగా తన శరీరాన్నే వైద్యకళాశాలకు దానం చేశాడు..."

వీరాంజనేయస్వామి ముందు కళ్ళు మూసుకొని ప్రార్థిస్తున్న నాకు ఆ రూపంలో అంతర్లీనంగా పెంటయ్య రూపు మనో నేత్రాలకు కనిపించసాగింది.

**(5-04-2004 జాగృతి సచిత్ర వారపత్రిక)**

కథా నిలయం
శ్రీకాకుళం